క్లుప్తంగా

నేడు వీఎంసీ 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్, నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర వాసులు ఫిర్యాదులు, అర్జీలను అధికారులకు అందజేయాలన్నారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

జనరల్ బిపిన్ రావత్ మెమోరియల్ టెస్ట్‌కు విశేష స్పందన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేటలోని సీవీఆర్ మున్సిపల్ హైస్కూల్ నందు ఆత్మబంధువుల సేవా సంఘం పదవ తరగతి విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన జనరల్ బిపిన్ రావత్ మెమోరియల్ టాలెంట్ టెస్ట్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. టాలెంట్ టెస్టును ప్రారంభించిన ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావాలో వివరించారు. కార్యక్రమంలో ఆత్మబంధువుల సేవా సంఘం వ్యవస్థాపకుడు సితల ఉషాకిరణ్, సీవీఆర్ స్కూల్ హెచ్ఎం సీహెచ్ వీ సుబ్రహ్మణ్యం, వీటీఆర్ నెహ్రూ, తులసీరావు, కుమార్, ఆంజనేయులు, నీలిమ, బత్తిన సుబ్రహ్మణ్యం, డీ వెంకటేశ్వరరావు, డీ సుజాత, మేఘన, మురళీకృష్ణ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

'జిలానీఖాన్ సేవలు వెలకట్టలేనివి'



విజయవాడకల్చరల్: సాంస్కృతిక రంగానికి జిలానీఖాన్ చేసిన సేవలు వెలకట్టలేనివని సీనియర్ పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు అన్నారు. నగరానికి చెందిన కళాకారులు, సాహితీ సంస్థల నిర్వాహకుడు జిలానీఖాన్ మృతికి నగరానికి చెందిన కళా సంస్థల ప్రతినిధులు గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళా వేదికపై ఆదివారం సంతాప సభను నిర్వహించారు. డేవిడ్‌రాజు మాట్లాడుతూ జిలానీఖాన్ పేద కళాకారుల కోసం అనేక కార్యక్రమాలను నిర్వహించారని, వారికి ప్రతీ నెల నిత్యావసరాలను పంపిణీ చేశారని తెలిపారు. సంతాప కార్యక్రమంలో సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చిట్టిబాబు, రమాశంకర్, వీరభద్రరావు, మారేపల్లి జోషి, పి.శ్రీనివాసరావు, ఆదిరాల జయప్రభ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు బాసటగా నిలవాలి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆపదలో ఉన్న ముస్లిం మైనార్టీలకు ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) సభ్యులంతా బాసటగా నిలవాలని ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. ఏఎంసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సింగ్‌నగర్‌లోని ఆ కమిటీ కార్యాలయంలో ఆదివారం జరిగింది. దీనిలో పాల్గొన్న నాగుల్‌మీరా మాట్లాడుతూ రాబోయే మూడు నెలల కాలంలో ఏఎంసీ ఆధ్వర్యాన నిరుపేదలను ఆదుకునేందుకు తోపుడు బండ్ల పంపిణీ, ఆర్థిక సాయాలు, ఉపకార వేతనాలను అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఏఎంసీ దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను కచ్చితంగా పరిష్కరించేలా కమిటీ ప్రతినిధులు పని చేయాలని సూచించారు. అనంతరం కమిటీ ప్రతినిధులకు సభ్యత్వ కార్డులు అందజేశారు. సమావేశంలో షేక్ సాజిద్‌అలీ, ఎండీ కాలేషా, షేక్ హుస్సేన్, బిలాల్, సోహేబ్, షేక్ రజియాబేగం పాల్గొన్నారు.

మురుగు కాల్వలో పడి తాపీ మేస్త్రి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబే కాలనీ సీ బ్లాక్‌కి చెందిన చిన్నం రవి(47) అనే తాపీ మేస్త్రి రవీంద్రభారతి స్కూల్ ఎదురుగా ఉన్న డ్రైనేజీ కాల్వలో పడి మృతి చెందడంతో పోలీసులు ఆదివారం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. తాపీ పని చేస్తున్న చిన్నం రవి శనివారం పనికి వెళ్లి రాత్రికి ఇంటికి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఎటువంటి సమాచారం లేదు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కుటుంబ సభ్యులు రవీంద్రభారతి స్కూల్ వద్ద డ్రైనేజీ కాల్వలో పడి ఉన్న రవి మృతదేహాన్ని గుర్తు పట్టారు. మృతుని భార్య రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సండే @ స్మృతివనం



నగరంలోని బీఆర్ అంబేడ్కర్ స్మృతివనంలో సందడి నెలకొంది. ఆదివారం పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలిరావడంతో స్మృతివనం ప్రాంగణమంతా కిటకిటలాడింది. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జీవిత విశేషాల దృశ్యాలు, వివిధ ఆకృతులను సందర్శకులు తిలకించారు. సాయంత్రం స్మృతివనం విశేషంగా ఆకట్టుకుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





జానపద కళారూపాలను ఆదరించాలి

విజయవాడకల్చరల్: జానపద కళారూపాలను ఆదరించాలని గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్ అన్నారు. దామోదర జానపదం, మామ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం జానపదం– సినీ పదం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. శ్రామిక జీవనంలోనే ఆట పాట ఉందన్నారు. జానపద గాయకుడు దామోదర గణపతిరావు మాట్లాడుతూ సంస్థ ద్వారా ఎందరో కళాకారులను వెలుగులోకి తీసుకువచ్చామన్నారు. కార్యక్రమంలో మహంతి వాసుదేవరావు, గిరిజన గీత శిల్పి బొండా జగన్మోహనరావు, డాక్టర్ కొండా వేణుగోపాలరెడ్డి పాల్గొని ప్రసంగించారు. కళాకారులు గిరీష్ కుమార్, సుశీల్ కుమార్, చక్రవర్తిలను గజల్ శ్రీనివాస్ సత్కరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు డాక్టర్ జయంతి చక్రవర్తి, భారతి, సిరి మోక్ష, తేజ, హుస్సేన్‌బీ, సాయి, శ్రీనివాస్, సునీల్, గణపతి గీతాలను ఆలపించారు. జానపద గాయకుడు దామోదర గణపతిరావు షష్టి పూర్తి సందర్భంగా అభిమానులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమాన్ని సినీ రంగస్థల నటుడు కొప్పుల ఆనంద్ నిర్వహించారు.



మాట్లాడుతున్న దామోదర గణపతిరావు, వేదికపై గజల్ శ్రీనివాస్, సుశీల్‌కుమార్, గిరీష్‌కుమార్

నగర వాసులకు జాతీయ స్థాయి పురస్కారాలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విజయవాడ నగరానికి చెందిన మేడా సింధుశ్రీ, లంకే లోకేష్ బాబుకు తెలుగు వెలుగు సంస్థ అందజేసే జాతీయస్థాయి పురస్కారాలు దక్కడం చాలా సంతోషంగా ఉందని స్ఫూర్తి క్రియేటివ్ స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. చిత్రలేఖనం, క్రియేటివ్ క్రాఫ్ట్స్, పేపర్ క్విల్లింగ్ అంశాల్లో ప్రతిభ చూపినందుకు సింధుశ్రీకి తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారం, ఫొటోగ్రఫీ, విజువల్ కమ్యూనికేషన్ రంగంలో ప్రతిభ చూపినందుకు లంకే లోకేష్‌బాబుకు తెలుగు వెలుగు స్ఫూర్తి కళారత్న జాతీయ పురస్కారాలు అందుకున్నారన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఏటా ఈ పురస్కారాలను అందిస్తారని వివరించారు. తెలంగాణలోని యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో హన్మకొండలో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ భవనంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాలను సింధుశ్రీ, లోకేష్‌లకు అందజేశారని శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక వ్యవస్థాపక చైర్మన్ పాలోజు రాజ్‌కుమార్, తెలుగు వెలుగు వేదిక జాతీయ కన్వీనర్ డాక్టర్ రంగిశెట్టి రమేష్, యువత చైతన్య వెల్ఫేర్ సొసైటీ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొని ఈ అవార్డులను అందజేశారని చెప్పారు.



అవార్డులు పొందిన మేడా సింధూశ్రీ, లోకేష్ బాబు

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వృద్ధులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్య నిపుణుడు డాక్టర్ కోనా వీర బ్రహ్మం సూచించారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం ఆరోగ్యంపై అవగాహన, ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని వృద్ధులు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రసాద్



● ఉత్సాహంగా స్విమ్మింగ్ పోటీలు

ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణానదిలో ఆదివారం స్విమ్మింగ్ పోటీలు జరిగాయి. 24వ కృష్ణా రివర్ క్రాస్ 1.5 కిలోమీటర్ల ఈతల పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

చాంద్ తారా ప్యానల్ విజయం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని మోతీ మసీదు కమిటీ ఎన్నికల్లో చాంద్ తారా ప్యానల్ విజయం సాధించింది. షాదీఖానా ఆవరణలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరిగింది. మొత్తం 594 ఓట్లు గాను 546 ఓట్లు నమోదయ్యాయి. సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు జరగగా ఎండీ బాషాకు చెందిన చాంద్ తారా 80 ఓట్ల మెజారిటీతో గెలుపొందింది. ఎన్నికల అధికారి ఫతావుల్లా విజయం సాధించిన చాంద్ తారా సభ్యులకు డిక్లరేషన్ పత్రాన్ని అందజేశారు. పోలింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కొత్తపేట పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మోతీ మసీదుతో పాటు షాదీఖానా అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఎండీ బాషా పేర్కొన్నారు.



గెలుపొందిన ప్యానల్‌కు డిక్లరేషన్ అందజేస్తున్న ఎన్నికల అధికారి

శాంతిభద్రతలకు ప్రత్యేక బీటు ఏర్పాటు చేయాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు మధ్యకట్టలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక బీటు ఏర్పాటు చేయాలని స్థానిక కార్పొరేటర్ బీ జానారెడ్డి కోరారు. ఆదివారం ఆయన బుడమేరు మధ్యకట్ట ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ బుడమేరు మధ్యకట్టలో రాత్రివేళల్లో అసాంఘిక శక్తులను అరికట్టేందుకు ప్రత్యేక బీటు ఏర్పాటు చేయాలని పోలీసులను కోరారు. అనంతరం రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. రేషన్ పంపిణీ గురించి కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు.

కనపర్తి సేవలు ఎనలేనివి



మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరపాలకసంస్థలో యూజీడీ మేస్త్రిగా కనపర్తి వెంకటేశ్వరరావు అందించిన సేవలు ఎనలేనివని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక హనుమాన్‌పేట మారుతీ ఫంక్షన్ హాలులో కనపర్తి వెంకటేశ్వరరావు పదవీ విరమణ చేసిన సందర్భంగా అభినందన కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా గత 38 సంవత్సరాలుగా నగరపాలకసంస్థలో ఆయన చేసిన సేవలను అభినందించారు. ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి, నగరపాలకసంస్థ చీఫ్ ఇంజినీర్ ప్రభాకరరావు, 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష, నగరపాలకసంస్థ అధికారులు రామకృష్ణ, కరీముల్లా, నర్మద, సంస్థ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని శాలువా, జ్ఞాపికతో వెంకటేశ్వరరావు దంపతులను సత్కరించారు.

సామాజిక సేవలు విస్తృతం చేయాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వాసవీ క్లబ్‌ల పాలకవర్గాలు సామాజిక సేవలను మరింత విస్తృతం చేయాలని ఆ క్లబ్‌ల అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్యగుప్తా అన్నారు. వాసవీ జిల్లా 212 పరిధిలోని వివిధ క్లబ్‌లు అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారుల శిక్షణా తరగతులు వన్‌టౌన్‌లోని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వేముల హజరత్తయ్యగుప్తా మాట్లాడుతూ.. క్లబ్ నిర్వాహకులు క్రమశిక్షణతో, నిర్మాణాత్మకంగా, కులమతాలకు అతీతంగా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సమాజంలోని అట్టడుగు వర్గాలకు అవసరమైన సేవా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. క్లబ్ జిల్లా గవర్నర్ కె.సతీష్ మాట్లాడుతూ.. క్లబ్ పనితీరుతో అందరి ప్రశంసలందుకోవాలన్నారు. కార్యక్రమంలో రీజియన్ చైర్మన్లు అనిల్‌కుమార్, చెన్నకేశవులు, అంజని శ్వేత, వేంకటేశ్వర్లు, క్లబ్‌ల ప్రముఖులు సంతోష్ చక్రవర్తి, బొడ్డు శ్రీనివాసరావు, సురేష్, రోజా, శివకుమార్ పాల్గొన్నారు.

వాంబేకాలనీలో పోలీసు పెట్రోలింగ్



పాయకాపురం(విజయవాడరూరల్): నున్న పోలీసు స్టేషన్ పరిధిలో రద్దీగా ఉండే ప్రాంతాల్లో సీఐ ఎస్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో గత కొద్ది రోజులుగా పోలీసు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతోంది. ఆదివారం పైపులరోడ్డు సెంటర్ నుంచి వాంబేకాలనీ వరకు పోలీస్ ఫుట్‌పెట్రోలింగ్ నిర్వహించారు. రహదారుల్లో రోడ్లు ఆక్రమించుకొని ప్రజలకు అసౌకర్యం కల్గిస్తున్న ఆక్రమణలను తీయించారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలు రోడ్డుపై పార్కు చేసి ప్రజలకు అసౌకర్యం కల్గించవద్దని అవగాహన కల్పించారు. ఫుట్‌పెట్రోలింగ్‌లో సీఐ దుర్గాప్రసాద్‌తో పాటు ఎస్సై శేషారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నిండు మనసుతో ఆశీర్వదించండి



భగీరథ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అహర్నిశలు ప్రజల సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని నిండు మనసుతో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే, సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు కోరారు. స్థానిక ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం మాచవరం వాకర్స్ అసోసియేషన్ నాయకులు, వాకర్స్‌తో మాటా మంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెలంపల్లి వాకర్స్ సభ్యుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యానికి వాకింగ్ ఎంతో అవసరమని ప్రజల ఆరోగ్యం కోసం పని చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. వాకర్స్ సభ్యులకు తాను అండగా ఉంటానని తెలిపారు. వాకర్స్ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 26వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇంఛార్జ్ అంగిరేకుల గొల్లబాబు, నాగేశ్వరరావు, వాకర్స్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

31వ డివిజన్‌లో..

స్థానిక 31వ డివిజన్ ముత్యాలంపాడులో ఆదివారం జరిగిన డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొన్నారు. తొలుత ఇరువురు కలిసి భగీరథ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలలోకి తీసుకువెళ్లి వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష, డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం, పార్టీ నాయకులు వెంకటేశ్వరరావు, విజయ్, గోవిందు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వాకర్స్‌క్లబ్ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి రంగా

పాయకాపురం(విజయవాడరూరల్): పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన్ రంగా అని ఎమ్మెల్యే, సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. రాజీవ్ నగర్ వడ్డెరకాలనీ కట్టపై ఏర్పాటు చేసిన వంగవీటి మోహన్ రంగా విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం రంగా ఎనలేని కృషి చేశారని అన్నారు. రంగా ఆశయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గంలోని ప్రజల కష్టసుఖాల్లో తాను పాలుపంచుకుంటానని నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని వెలంపల్లి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మోదుగుల గణేష్, యరగొర్ల శ్రీరాములు, మాజీ మేయర్ తాడి శకుంతల, వరలక్ష్మీ, వడ్డేపల్లి సామ్రాజ్యం, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాజీవ్‌నగర్‌లో రంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గుడ్ విషెస్‌తో మనో ధైర్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్‌సీజీ క్యాన్సర్ హాస్పిటల్, రెడ్ ఎఫ్ఎం ఆధ్వర్యంలో ఆదివారం ఎంజీ రోడ్డులోని పీవీపీ మాల్‌లో ది పవర్ ఆఫ్ గుడ్ విషెస్ అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తొలుత రెడ్ ఎఫ్ఎం ఆర్‌జేలు ఇస్మార్ట్ స్వీటీ, అన్యలు మాల్‌కు వచ్చిన వారి దగ్గర నుంచి గుడ్ విషెస్ తీసుకుని ఎఫ్ఎంలో ప్రసారం చేశారు. ఈ సందర్భంగా క్యాన్సర్ నిపుణుడు డాక్టర్ వీఎస్ఎన్ రావు మాట్లాడుతూ.. ప్రేమతో మీరు బాగుండాలని అని చెప్పే మాటలు ఎంతో మనోధైర్యాన్నిస్తాయన్నారు. ఇలాంటి కార్యక్రమం క్యాన్సర్‌తో బాధపడుతున్న వారికి మనోధైర్యం ఇవ్వడంతో పాటు క్యాన్సర్‌పై అవగాహన పెంచుతుందని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ కె.రంగనాథ్, టి.యువకిషోర్, రెడ్ ఎఫ్ఎం స్టేషన్ హెడ్ క్రాంతికుమార్, ప్రోగ్రామింగ్ హెడ్ ఆదిల్‌బాషా పాల్గొన్నారు.



బోర్డుపై గుడ్ విషెస్ తెలుపుతున్న మాల్ సందర్శకులు

క్యాన్సర్ రహిత సమాజం కోసం కృషి

మధురానగర్(విజయవాడసెంట్రల్): క్యాన్సర్ రహిత సమాజ స్థాపనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని వాకర్స్ క్లబ్ డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన ప్రముఖ క్యాన్సర్ నిపుణుడు డాక్టర్ సీహెచ్ మురళీకృష్ణ అభినంధన, క్యాన్సర్‌పై అవగాహన కార్యకమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మానవాళికి పెనుభూతంగా మారిన క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. డాక్టర్ సీహెచ్ మురళీకృష్ణ క్యాన్సర్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం డాక్టర్ సీహెచ్ మురళీకృష్ణను శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. అనంతరం క్యాన్సర్ బాధితులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, సభ్యులు పోళవరపు రాజారావు, కే సత్యనారాయణ, బత్తిన సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ మురళీకృష్ణను సత్కరిస్తున్న వసంతకుమార్